క్లుప్తంగా

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : ఉపాధి పథకం కింద చేసే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీఓ మోదీన్‌బాషా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని లద్దగిరిలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.300 పడుతుందన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామన్నారు.

ఎన్‌ఏఎస్ పరీక్షల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం: మండంలో నాలుగు పాఠశాలలో జరగుతున్న ఎన్‌ఏఎస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షలను గురువారం ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. పాణ్యంలోని ఏపీ మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాల, గోరుకల్లు ఉన్నత పాఠశాల, లక్ష్మీ గాయత్రి స్కూల్ పాఠశాలలో ఈ పరీక్ష నిర్వహించగా 109మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓలు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



ఈఓ అజయ్‌భాస్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని రామన్ హైస్కూల్ వెనుక ప్రాంతంలో ఉన్న రస్తాలో సీసీ రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు గ్రామ పంచాయతీ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం సీపీఐ నాయకులు ఈఓ అజయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజు మాట్లాడుతూ ఏళ్లతరబడి గృహాలు నిర్మించుకుని పేదలు జీవిస్తున్నారని, రోడ్డు లేనందున ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వీరయ్యస్వామి, నాగేష్, శేఖర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోండి



ఎస్‌ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు శివలింగమ్మ

సి.బెళగల్:ఎర్రమట్టిని అక్రమంగా తమ పొలం నుంచి తరలించుక పోతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని పోలకల్ గ్రామానికి చెందిన శివలింగమ్మ బుధవారం ఎస్‌ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్‌ఐ విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాధితురాలు మాట్లాడుతూ బ్రాహ్మణదొడ్డి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 101/1ఏలో 2.34 ఎకరాల పొలం, సర్వే నెంబర్ 101/2లో 1.82 ఎకరాలలో అక్రమార్కులు దాదాపు ఏడు వందల టిప్పర్ల ఎర్రమట్టిని తరలించారని ఆరోపించారు. అక్రమార్కుల వివరాల ఆధారాలను పోలీస్‌లకు అందజేశామన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: మండల పరిధిలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి దుకాణాలకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో ఆదాయం పెరిగిందని ఈఓ మద్దిలేటి తెలిపారు. ఈఓ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో కొబ్బరి చిప్పలను పోగు చేసుకోవడం, మూడవ దుకాణంలో ఏడాదిపాటు కొలుకు నిర్వహించిన వేలం పాట నిర్వహించామన్నారు. కొబ్బరి చిప్పలు పోగుకు సంబంధించి గతేడాది రూ.12,800 వచ్చిందని, ఈ ఏడాది రూ.13 వేలకు రవికుమార్‌గౌడు దక్కించుకున్నారన్నారు. అదేవిధంగా 3వ దుకాణం గతేడాది రూ.41,000 వచ్చిందని, ఈఏడు రూ. 50,000 భాస్కర్ దక్కించుకున్నారని వివరించారు. మొత్తం రూ.9,200 అదనంగా ఆదాయం వచ్చిందన్నారు.

అప్పు చేసి ‘మధ్యాహ్న భోజనం’

- మూడు నెలలుగా అందని బిల్లులు
- రూ.25 లక్షలకుపైగా పెండింగ్
- ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులు



సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో భోజనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)



బురాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని నిధుల కొరత వెంటాడుతోంది. మూడు నెలలుగా బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అప్పుల పాలవుతున్నారు. సి.బెళగల్ మండలంలో కొన్ని పాఠశాలలకు జూన్ నెల నుంచి, మరికొన్ని పాఠశాలలకు సెప్టెంబర్ నుంచి, ఉన్నత పాఠశాలలకు అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు రావాల్సి ఉంది. దీంతో మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు నిర్వాహకులు పడరానిపాట్లు పడుతున్నారు. వడ్డీలకు అప్పులుచేసి పథకాన్ని అమలు చేస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరుకులు, కాయగూరల ధరలకు సాధారణంగా గిట్టుబాటు ఉండడం లేదంటున్నారు నిర్వాహకులు. బిల్లుల పెండింగ్ మూలంగా అప్పుల మూలంగా వడ్డీ భారంగా మారుతుందని నిట్టూర్చుతున్నారు. బకాయిలు మంజూరవ్వక మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిర్వాహకులతో పాటు, వంట మనిషి, హెల్పర్లు నుంచి విద్యార్థుల వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో భోజనం నాణ్యత ప్రశ్నార్థకంగా మారాయి. పాఠశాలలను తనిఖీ చేసే అధికారులు సైతం నిర్వహణ లోపాలను ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లు విడుదలకు చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు మధ్యాహ్న భోజన నిర్వాహకులు.

మండలంలో పరిస్థితి ఇలా...

సి.బెళగల్ మండలంలో 31 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలలతో మొత్తం 44 ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించాల్సి ఉంది. ఒకటి ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 3,937 మంది, ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు 2,793 మంది, తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులు 1,756 మంది చొప్పున మొత్తం 8,486 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఐదు పాఠశాలలకు జూన్ నెలలో రూ.52,984, ఎనిమిది పాఠశాలలకు జూలై నెలలో రూ.1,46,430, ఆగష్టులో ఐదు పాఠశాలలకు రూ.54,689లతో మొత్తం రూ.2,54,103 పెండింగ్ బిల్లులు ఉన్నాయి. మొత్తంగా మండలానికి రూ.25,48,578ల బిల్లు మంజూరు కావాల్సి ఉంది. దీంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని నెట్టుకొస్తున్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యతనిచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జననేత మాజీ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. మనబడి నాడు – నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. ప్రైవేట్ స్కూళకు దీటుగా సర్కార్ బడులను తీర్చిదిద్దారు. మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సమకూర్చారు. జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు గుడ్డు, చిక్కి, కురగాయలు, ఆకుకూరలతో నాణ్యమైన పౌష్టికాహారం అందించిన విషయాన్ని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని నిట్టూర్చుతున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు.

పెండింగ్ బిల్లుల వివరాలు....

నెల	1 నుంచి 5 తరగతులకు	6 నుంచి 8 తరగతులకు	9 మరియు 10 తరగతులకు	మొత్తం
సెప్టెంబర్	రూ.3,91,775	రూ.3,42,158	రూ.---	రూ.7,33,933
అక్టోబర్	రూ.2,62,155	రూ.2,02,508	రూ.1,18,625	రూ.5,83,288
నవంబర్	రూ.3,73,806	రూ.3,82,864	రూ.2,20,584	రూ.9,77,254
మొత్తం	రూ.10,27,736	రూ.9,27,530	రూ.3,39,209	రూ.22,94,475

ఆరు నెలలుగా బిల్లులు రాలేదు



మేము జూన్ నుంచి పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నాము. అయితే మాకు ఇప్పటి వరకు ఒక్క రూపాయ కూడా రాలేదు. అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పండింది. ఖర్చులు కూడా బాగా పెరిగిపోయాయి. దీంతోపాటు ఉన్న బిల్లులు రానందున చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.

– లక్ష్మి, వంట నిర్వాహకురాలు, ఈర్లదిన్నె ప్రైమరీ స్కూల్

అప్పు తీసుకొచ్చి భోజనం వడ్డిస్తున్నాం



బిల్లులు సకాలంలో పడకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వడ్డీలకు తీసుకొచ్చి నెట్టుకొస్తున్నాం.కూరగాయాలు, సరుకుల అప్పు ఇవ్వడం లేదు. ధరలు కూడా భారీగా పెరిగాయి. ఇప్పుడు చేసే అప్పులకు మూడు నెలల అనంతరం పడే బిల్లులు వడ్డీ అదనంగా భరించాల్సి వస్తుంది. ఖర్చులుపోను కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. చాలా ఇబ్బందిగా ఉంది.

– శకుంతల, వంట నిర్వాహకురాలు, కొత్తకోట జెడ్పీ హైస్కూల్

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలంటే నిర్వాహకులకు ఎప్పటికి అప్పుడు బిల్లులు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బిల్లులు పెండింగ్ పెడితే నిర్వాహకులు అప్పులు చేయాల్సి వస్తుంది. వడ్డీ భారంగా మారుతుంది. మధ్యాహ్న భోజనం నాణ్యత లోపించే అవకాశం లేకపోలేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలి.

– వీరేష్ యాదవ్, ఎస్ఎఫ్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నాం



రెండుమూడు నెలలుగా బిల్లులు పడలేని మాట వాస్తవమే. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. నెల పూర్తి అయిన వెంటనే విద్యార్థులకు అందించిన భోజన వివరాలు, బిల్లులను హెచ్‌ఎంల నుంచి తెప్పించుకుని అప్‌లోడ్ చేస్తున్నాం . అయితే ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిన వెంటనే వంట నిర్వాహకులకు నేరుగా బ్యాంక్ ఖాతాలకే బిల్లులు మొత్తం జమ అవుతాయి. విద్యార్థులకు పౌష్టికాహారంను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జ్యోతి, ఎంఈఓ, సి.బెళగల్

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న సర్వేయర్ ఏడీ మున్ని కన్నన్

కల్లూరు: భూముల రీసర్వేకు సంబంధించి వచ్చిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని సర్వే ఏడీ మున్ని కన్నన్ అధికారులను ఆదేశించారు. కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవిన్యూ, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 14 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. సర్వే పూర్తయిన గ్రామాలలో గ్రామసభలు నిర్వహించగా మొత్తం 1,646 అర్జీలను రైతులు అందించారన్నారు. ప్రతి రైతు అర్జీని త్వరితగతిన సమస్యలు లేకుండా పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డీటీ శివరామ్, మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో రామాపురం చిన్నారి ప్రతిభ

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన హరీష్, స్రవంతి దంపతుల ఐదేళ్ల కుమార్తె లక్ష్మి ఇషా సంకల్ప జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాంస్యపతకం సాధించారు. హరీష్, స్రవంతి దంపతులు ఉద్యోగ రీత్యా మహారాష్ట్రలోని ముంబాయిలో ఉంటున్నారు. వీరి ఐదేళ్ల లక్ష్మి ఇషా సంకల్ప కరాటేలో రాణిస్తోంది. ఈ నేపథ్యంలో గత నవంబర్ నెల 28వతేదీ నుంచి డిసెంబర్ 1వరకు పూణేలో జరిగిన 27వ ఓమా నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో చిన్నారి లక్ష్మి ఇషా అద్భుతమైన ప్రతిభచాటి కాంస్యపథకాన్ని సొంతం చేసుకుంది. కరాటేలో చిన్నారి లక్ష్మి ఇషాను కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



కాంస్య పతకంతో చిన్నారి లక్ష్మి ఇషా సంకల్ప

రైతులకు ఉపయోగపడే పనులు చేయించండి



తిరుపాడులో వేసిన సీసీ రోడ్డును పరిశీలించిన డ్వామా పీడీ

గడివేముల: గ్రామాల్లో రైతులకు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయించాలని నంద్యాల జిల్లా డ్వామా పీడీ జనార్దన్ ఉపాధి సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అదేవిధంగా సీసీ రోడ్లను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ వాసుదేవ గుప్తాతో కలిసి నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఉపాధి కూలీకి వందరోజుల పనిని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఉపాధి పనులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, గోకులం షెడ్లను నిర్ణయించిన సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జాబ్ కార్డు లేని వారు స్థానిక కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి



సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అనేక సంవత్సరాలుగా ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు బుధవారం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పెండింగ్ జీతాలు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు.

7న భగవద్గీత కంఠస్థ పోటీలు

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నగర శివారులోని విజ్ఞాన పీఠంలో ఈనెల 7వ తేదీన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు కరెస్పాండెంట్, ప్రాంత సహసేవ ప్రముఖ్ పీపీ గురుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత పదో అధ్యాయంపై కంఠస్థ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఈ అధ్యాయంలోని 1 నుంచి 10 శ్లోకాలు, 6, 7 తరగతుల విద్యార్థులకు 1 నుంచి 15 శ్లోకాలు, 8, 9 తరగతుల విద్యార్థులకు 1 నుంచి 20 శ్లోకాల వరకు కంఠస్థం చేసి చెప్పవలసి ఉంటుందన్నారు. నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా యాజమాన్యాలు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

కల్లూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి రమేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాసులు, రమేష్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఈ నెల 9 నుంచి సమ్మె బాట పడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మనోహర్, నాయకులు వెంకటేశ్వర్లు, యాసిన్ బేగ్, జ్ఞానమ్మ కార్మికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పాణ్యం: మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 3వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి గురువారం తెలిపారు. 6వ తేదీన బలపనూరు, 7న పాణ్యం, 10న భూపనపాడు, 11న గగ్గటూరు, 12న ఆలమూరు, 13న అనుపూరు, 17న చిలకల, 18న గోనవరం, 19న గోరుకల్లు, 20న కొండజుటూరు, 21న కౌలురు, 24న కొణిదేడు, 26న మద్దూరు, 27న నెరవాడ, 28న పిన్నాపురం, 31వ తేదీన తొగర్చేడు గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. అదేవిధంగా జనవరి 2న తమ్మరాజుపల్లె, 3వ తేదీన ఎస్ కొత్తూరు, గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గ్రామలలో ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ శివ ప్రసాద్ బుధవారం తెలిపారు. 21 రెవెన్యూ గ్రామలలో పొలలకు సంబంధించిన సమస్యలపై రెవెన్యూ సదస్సులలో వినతులు సమర్పించాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద అడ్డవాగుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఉదయం తిరుపతి నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న ఓ కారు బ్రిడ్జిని ఢీకొంది. మరో వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. కారులో నలుగురు ఉండగా మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకధర గ్రామానికి చెందిన గౌరి శంకర్, వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

గడివేముల: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండల పరిధిలోని గని గ్రామానికి చెందిన దేవనూరు శివలక్ష్మీ(30) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందిందని ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. దేవనూరు శివలక్ష్మీ కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతుందన్నారు. కడుపునొప్పి తీవ్రం కావడంతో గత నెల 29న ఇంట్లో పురుగుల మందు తాగిందన్నారు. చుట్టుపక్కలవారు గమనించి కర్నూలు పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. మృతురాలి తండ్రి గోవిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతిచెందిన శివలక్ష్మికి ఇద్దరు కుమారులు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన కమిటీ చైర్మన్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముందుగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వసతులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యేలా ప్రత్యేక లైన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం అల్ట్రాసౌండ్ మిషన్, ఎక్స్‌రే పరికరాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎంపీడీఓ శ్రీనివాసులు, వైద్యాధికారిని డాక్టర్ మంజుల, వైద్యులు అశ్వనికుమార్, శ్రీకాంత్‌రెడ్డి, దాదాబాషా, నవ్యతేజ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టీడీపీ మండల కన్వీనర్ గోవింద్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం చేరిన ప్రశ్నా పత్రాలు

సి.బెళగల్: సమ్మేటివ్ అసెస్‌మెంట్ - 1 (ఎస్‌ఏ -1) పరీక్షల ప్రశ్నా పత్రాలు సి.బెళగల్ ఎంఈఓ కార్యాలయం చేరుకున్నాయి. ఈ మేరకు సీఆర్పీలు బుధవారం ప్రశ్నా పత్రాలను ఎంఈఓ కార్యాలయంలో భద్ర పరిచారు. ఈ నెల 11వ తేది నుంచి ప్రారంభం కానున్న ఎస్ఏ -1 పరీక్షలకు పాఠ్యాంశాల వారీగా విడదీసి స్కూళకు అందజేస్తామని సీఆర్పీలు వెంకటరాముడు, శోభారాణి తెలిపారు.

గంజాయి సాగు చట్టరీత్యా నేరం



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఓర్వకల్లు: గంజాయి పంట సాగు చట్టరీత్యా నేరమని జిల్లా వ్యవసాయాధికారిని పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని కాల్వ, హుసేనాపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమెతోపాటు లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు, ఏడీఏ శాలురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ గంజాయి సాగు దుష్పలితాలను వివరించారు. రబీలో సాగు చేసిన శనగ, జొన్న పంటలకు అందజేసే బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు మాట్లాడుతూ కౌలు రైతులకు కూడా అన్ని బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కౌలు రైతులు తమ ధృవీకరణ పత్రాలతో రైతు సేవా సబ్బందితో బ్యాంక్ మేనేజర్లను సంప్రదించి రుణాలు పొందవచ్చన్నారు. ఏడీఏ శాలురెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, రబీలో సాగు చేసిన శనగలకు వచ్చిన తెగుళ్ల తీరు, నివారణకు వాడాల్సిన పురుగు మందులను గురించి వివరించారు. కర్నూలు ఏపీఎల్‌సీ లక్ష్మణ్, హుసేనాపురం ఏపీజీబీ మేనేజర్ శివకృష్ణ ప్రధానమంత్రి జన సురక్ష, జీవన్‌జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ముద్ర రుణాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతు సేవా సిబ్బంది గంగాధర్, భువనేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు చేసుకోండి



ఈ.తాండ్రపాడులో ఈ క్రాప్ నమోదు చేయిస్తున్న ఏఓ రూఫస్ రోనాల్డ్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఈ.తాండ్రాపాడు గ్రామంలో బుధవారం ఏఓ రూఫస్ రోనాల్డ్ పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీలో సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా బీమాకు సంబంధించిన ప్రీమియంను రైతులు చెల్లించాలన్నారు. గ్రామ సమీపాన సాగు చేసిన జొన్నపైరును ఏఓ పరిశీలించారు. సాగులో సస్య రక్షణ పద్ధతులను వివరించారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటకోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పెంచికలపాడులో వేరుశనగపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : రబీ కింద సాగు చేసిన పప్పు శనగ పంటను రైతులు ప్రతి రోజు పరిశీలిస్తూ తెగుళ్లు సోకకుండా సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని కోడుమూరు, వెంకటగిరి గ్రామాల్లో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి వరి, శనగ పంటలపై ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న వేళ శనగ పంటను చీడపీడల భారీ నుంచి రక్షించుకోవాలన్నారు. ముఖ్యంగా శనగలో పచ్చపురుగు, లద్దెపురుగు ఉంటే ఎకరాకు 100గ్రాముల ఇమామిక్టిన్ బెంజ్, 200గ్రాముల కార్బన్డిజంను పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే రబీ కింద సాగు చేసిన శనగ, జొన్న పంటలకు ఈనెల 15లోగా రైతులు ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని ఏఓ సూచించారు.

పెంచికలపాడులో...

గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో బుధవారం ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి శనగ, జొన్న పంటలపై ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు మెలకువలను రైతులకు వివరించారు. విత్తనశుద్ధి ద్వారా చీడపీడలు, తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చునన్నారు.